క్లుప్తంగా

'ఉన్నత్ భారత్ అభియాన్'పై అవగాహన నేడు



ఉన్నత్ భారత్ అభియాన్ (యూబీఏ)లోగో

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఉన్నత్ భారత్ అభియాన్ విభాగం(యూబీఏ) ఓరియంటేషన్ కార్యక్రమం మంగళవారం జరగనుంది. దీనికి కళాశాల అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నంలోని ప్రాంతీయ కో-ఆర్డినేటింగ్ సంస్థ సహకారంతో ఉదయం 10.30 గంటలకు కళాశాల సెమినార్ హాల్ వేదికగా కార్యక్రమం ప్రారంభమవ్వనుంది. ఇప్లిమెంటేషన్ ఆఫ్ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ గ్రూప్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం చేపట్టనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు తెలియజేశారు. అన్ని యాజమాన్యాల ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల నుంచి హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కార్మిక శాఖ తనిఖీలు


డీడీలు అందిస్తున్న ఉప కార్మిక కమిషనర్ దినేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కార్మిక శాఖ ఉప కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా గుజరాతీపేటలోని డిపార్ట్‌మెంట్ స్టోర్స్‌లో పనిచేస్తున్న 10 మంది కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం కాకుండా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నట్లు గుర్తించారు. యజమానుల నుంచి రూ.85,094 తేడా వేతనాన్ని డీడీ రూపంలో కార్మికులకు చెల్లించారు. అంతేకాకుండా ఓ హోటల్ యజమానిపై కేసు నమోదు చేసి, స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచి రూ.2 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. దుకాణాలు, వ్యాపార సంస్థల యజమానులు తమ వద్ద పనిచేస్తున్న కార్మికులకు చట్టప్రకారం జీతభత్యాలు చెల్లించాలని స్పష్టం చేశారు. లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉద్యోగ విరమణ పోలీసులకు సత్కారం


అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: ఉద్యోగ విరమణ పొందిన మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ టి.త్రినేత్రి, సీసీఎస్ ఎస్‌ఐ గఫూర్, ట్రాఫిక్ ఎస్‌ఐ వరదరాజులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సోమవారం ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో ఒడిదుడుకులను ఎదుర్కొని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండగా నిలుస్తాం


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓల్డేజ్ హోమ్, అనాథ ఆశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, మహిళలు, పిల్లలకు ఎప్పటికప్పుడు చట్టపరమైన సాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు హామీ ఇచ్చారు. సోమవారం ఆయన కలెక్టరేట్ రోడ్డులోని ప్రశాంతి ఓల్డేజ్ హోమ్, స్త్రీ సదనం, మాధవ మోటార్స్ ఎదురుగా ఉన్న మదర్ థెరిస్సా హోమ్‌లను సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలవడానికి ఆసక్తి చూపితే వారిని కలిపేందుకు కూడా సహకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జి.ఇందిరా ప్రసాద్, బి.ఎ.ఎల్.ప్రసాద్, యు.వి.రమణ, ఎస్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు సక్రమంగా ఉండాలి


డ్రైనేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో డ్రైనేజీలు సరిగా లేకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ శానిటరీ సిబ్బందికి కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు హెచ్చరించారు. నగరంలో హెల్త్ ఆఫీసర్ సుధీర్‌తో కలిసి పలు ప్రధాన కాలువలను సోమవారం పరిశీలించారు. మరమ్మతులు చేయాల్సిన కాలువలను గుర్తించి పనులు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అన్నదాతపై అక్కసెందుకో..!


రణస్థలం: మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌ను జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

- జిల్లా కేంద్రంలో నిరసనలకు వైఎస్సార్‌సీపీ పిలుపు
- ఎక్కడికక్కడ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు
- అన్నదాతకు అన్యాయంపై ధ్వజమెత్తిన నాయకులు

రణస్థలం: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందించారని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతపై జిల్లా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసనలకు బయల్దేరిన ఆయనను జేఆర్‌పురం పోలీసులు రణస్థలంలో నిర్బంధించారు. దీంతో ఆయన జాతీయ రహదారిపై కూర్చొని నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం తక్షణమే యూరియా కొరత తీర్చి అన్నదాతను ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వ వైఫల్యంతో రాష్ట్రంలో తీవ్ర యూరియా సంక్షోభం ఏర్పడిందని విమర్శించారు. యూరియా రైతు సేవా కేంద్రాలకు రాకుండా టీడీపీ నాయకుల ఇళ్లకు లారీలతో పంపించి సామాన్య రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గారలో...

ఎరువుల కొరతపై వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ర్యాలీకి వెళ్లకుండా ఎంపీపీ గొండు రఘురామ్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అంపోలులోని ఆయన స్వగృహం వద్దకు ఏఎస్ఐ తెలుగు చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది వెళ్లి కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతాంగానికి మద్దతుగా ఎరువుల కొరత, వాస్తవ పరిస్థితులను జిల్లా కలెక్టర్‌కు తెలియజేసేందుకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. రాష్ట్రంలోని రైతులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు.

శ్రీకాకుళం రూరల్‌లో...

జిల్లాలోని రైతులందరికీ ఎరువులను తక్షణమే అందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు కోరారు. యూరియా కొరతపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోమవారం తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా నాయకులను ముందస్తు అరెస్టులు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం రూరల్, గార పరిధిలోని పలు కూడళ్లలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడంతో, శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు రామ్‌మనోహర్‌నాయుడు వెళ్లి నాయకులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దన్‌రావు ఆధ్వర్యంలో స్టేషన్ ముందు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసనలు తెలుపుతూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, నాయకులు పొన్నాన కూర్మారావు, బగాది మనోజ్‌కుమార్, మార్పు పృథ్వీ, యాళ్ల శ్రీనివాసరావు, మట్ట నగేష్, మార్పు మన్మథరావు, నందూరు చందు, పి.రమేష్, వి.వెంకట అప్పలనాయుడు, పిల్లల శ్రీధర్, రావాడ జోగినాయుడు, ఉంగటి రమణ, సీపాన మహేంద్ర, యండ రమేష్, దాసరి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.


గార: ఎంపీపీ రఘురామ్‌ను హౌస్ అరెస్టు చేసిన దృశ్యం

రణస్థలంలో...

రైతులకు యూరియా కొరత సృష్టించి తీవ్ర అన్యాయానికి గురి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని వైఎస్సార్‌సీపీ లావేరు మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జి.సిగడాం మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణలు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద యూరియా కొరతపై వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు చేపట్టిన నిరసన ర్యాలీకి వెళ్తున్న లావేరు, జి.సిగడాం మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ప్రజల పక్షాన పోరాడే వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకోలేరని ధ్వజమెత్తారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందించలేని ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటన్నారు. రైతులను ఆదుకోకపోతే రానున్న రోజుల్లో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఈసర్ల గోవిందరావు, ఎంపీటీసీ లక్ష్మణరావు, ఇజ్జాడ సూర్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులను ఉంచిన పోలీసులు


శ్రీకాకుళం రూరల్: అరెస్టైన నాయకులకు సంఘీభావం ప్రకటిస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలి


కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

రణస్థలం: ఉచిత బస్సు పథకం వలన ఉపాధి కోల్పోతున్న తమను ఆదుకోవాలని ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు సంవత్సరానికి రూ.25 వేల భృతి ఇచ్చేలా చూడాలన్నారు. ఫైనాన్స్‌లు కట్టలేక, కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అలాగే డ్రైవర్లకు భారమైన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్ టాక్స్, టోల్ ఫీజులు 30 శాతానికి తగ్గించేలా పోరాడాలని కోరారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ఒత్తిడి తీసుకురావాలని విన్నవించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకుడు బాణాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల పాత్ర కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం శ్రీనివాసరావు

శ్రీకాకుళం అర్బన్: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలులో బ్యాంకర్ల పాత్ర కీలకమని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళంలోని జీటీరోడ్‌లో ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం బ్యాంకర్లు, విద్యుత్‌శాఖ అధికారులు మరియు సోలార్ వెండర్స్‌తో పీఎం సూర్యఘర్‌పై రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో 15,000 కనెక్షన్లు పెట్టడమే లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా బ్యాంకర్లు పని చేయాలని కోరారు. ఇప్పటివరకు 1500 లోన్లు మంజూరు చేయడం జరిగిందని, ఇంకా 230 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 3 కిలోవాట్‌ల వరకు ఎటువంటి ఆంక్షలు లేకుండా రుణాలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.సురేష్‌కుమార్, కోటబొమ్మాళి, పాతపట్నం, పలాస, నరసన్నపేట డీఈఈలు జీవీ సురేష్, జి.ప్రసాద్, ఐ.కృష్ణమూర్తి, రాజేష్, జేఈ అనిల్‌కుమార్, ఎస్‌బీఐ సీనియర్ మేనేజర్ టి.వెంకటేశ్వరరావు, ఏపీజీవీబీ క్రెడిట్ మేనేజర్ కె.భాస్కరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తప్పవు


సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ వీర్రాకుమార్

జి.సిగడాం: గ్రామాల్లో అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని రాజాం రూరల్ సీఐ వీర్రాకుమార్ స్పష్టం చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేకాట, కోళ్ల పందేలపై నిఘా వేస్తామన్నారు. కొన్ని గ్రామాల్లో యాత్రలు, పండగల సమయంలో తగాదాలను దృష్టిలో ఉంచుకుని ఇరువర్గాలపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చామని తెలియజేశారు. స్త్రీలు ధరించే బంగారు ఆభరణాలపై జాగ్రత్త వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల సంఖ్యను అదుపు చేసేందుకు ఇప్పటికే రహదారి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు కోరామన్నారు. మద్యంతాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎస్ఐ మధుసూదనరావు ఉన్నారు.

డీజేలకు అనుమతి లేదు

శ్రీకాకుళం క్రైమ్: వినాయకుని విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం కార్యక్రమాలకు రాత్రి 11 గంటలతో ముగింపు పలకాలని.. ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు స్పష్టం చేశారు. రెండో పట్టణ పరిధిలో పీఎన్‌కాలనీ, న్యూకాలనీ, ఇలిసిపురం రోడ్డు, బొందిలీపురం, మరికొన్నిచోట్ల పెద్ద విగ్రహాలున్నాయని.. డే అండ్ నైట్ కొత్త వంతెన వద్ద నిమజ్జనం పాయింట్ ఇచ్చామని అక్కడే విగ్రహాల నిమజ్జనం చేయాలని సూచించారు. ఊరేగింపులో అవాంతరాలు సృష్టిస్తే సహించేది లేదని హెచ్చరించారు.


మండపాల వద్ద అవగాహన కల్పిస్తున్న సీఐ ఈశ్వరరావు

నేడు వైఎస్సార్ వర్ధంతి

జి.సిగడాం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు ముషినివలస పంచాయతీ సర్వేశ్వరపురం ప్రధాన రహదారిలో ఉన్న ఆయన విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గ్రామస్థాయిలో ఉన్న అభిమానులు, కార్యకర్తలు, నాయకులు హాజరవ్వాలని కోరారు.

నాటక ప్రస్థానం ఎంతో గొప్పది


శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నాటక ప్రస్తానం ఎంతో గొప్పదని, ఎంతోమంది నాటక రచనల ద్వారా సాహిత్యాన్ని అభివృద్ధి చేశారని వక్త, విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు ఎ.శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో సాహిత్య గణపతి ఉత్సవాల్లో భాగంగా 'నాకాన్తం హి సాహిత్యమ్' పై ఆధ్యాత్మిక ప్రవచనం సోమవారం జరిగింది. అనంతరం వక్త శ్రీరామమూర్తిని మందిరం సభ్యులతో కలిసి అధ్యక్షుడు గుమ్మా నగేష్ సత్కరించారు. కార్యక్రమంలో మందిరం నారాయణ మూర్తి, నరసింహమూర్తి, నారాయణమూర్తి, కోమలరావు, వెంకటరమణ, చంద్రరావు, చాగంటి బాపయ్య, విశ్వేశ్వరరావు, ఉమారాణి, అనురాధ, సరస్వతి, మంగమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


విరాళ చెక్కును అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన అర్క డైమండ్స్ అధినేత పి.శ్రీనివాసరావు దంపతులు రూ.1,11,000 విరాళాన్ని అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు విరాళ చెక్కును సోమవారం అందించారు. రూ.లక్షకు మించిన విరాళాలు ఇచ్చిన దాతలకు రథసప్తమి వంటి పర్వదినాల్లో విశిష్ట దర్శనాలకు డోనర్ పాసులను అందజేస్తామని వెంకటరమణ తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చక సిబ్బంది ఇప్పిలి షణ్ముఖశర్మ, నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

చినుకు..వణుకు..!


హడ్కోకాలనీలో వర్షపు నీరు నిలిచిన దృశ్యం

- జల దిగ్బంధంలో చిక్కుకుంటున్న చిక్కోలు నగరం
- నీట మునుగుతున్న రోడ్లు, కాలనీలు
- ఎక్కడికక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలో చినుకుపడితే చాలు రోడ్లు చెరువుతున్నాయి. ఇటీవల తరచూ పడుతున్న వర్షాలకు నగరంలోని పీఎన్‌కాలనీ, కొత్తరోడ్డు, బలగ, హాస్పిటల్ రోడ్డు, బావాజీనగర్, డీసీసీబీ కాలనీ, ఆర్‌కే నగర్, విశాఖ-ఏ, బీ కాలనీలు, బ్యాంకర్స్ కాలనీ, పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డు, గుజరాతీపేట, ఏపీహెచ్‌బీ కాలనీ, హయతినగర్, అరసవల్లి ఆదిత్యనగర్ కాలనీలతో పాటు పలు ప్రాంతాలు నీటమునిగి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వర్షం కురుస్తున్న ప్రతిసారీ విద్యార్థులు స్కూళ్లకు, ప్రజలు తమ రోజువారీ పనులకు వెళ్లేందుకు, ప్రభుత్వ ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బలగ, సరస్వతీ మహల్ కూడలి, పొట్టి శ్రీరాములు కూడలి, రైతు బజారు, అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద అధికంగా నీరు చేరుతుండడంతో గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచిపోతోంది. ద్విచక్ర వాహనాలు, కార్లతో నీటిలోంచి ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.లక్షలు నీటిపాలు

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాలువల నిర్మాణాలకు, పాత కాలువల్లో పూడికలు తీయడానికి రూ.లక్షలు నిధులు వెచ్చిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు, అధికారులు జేబులు నింపుకునే పనులు తప్ప, ప్రజలకు ఉపయోగపడే పని ఒక్కసారైనా చేయడం లేదు. వర్షం కురిసిన రోజు హడావుడి చేసి పూడికలు తీయడం, ఆ తర్వాత వదిలేయడం పరిపాటిగా మారింది. నగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్, బలగ నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు, సరస్వతీ మహల్ నుంచి రామలక్ష్మణ కూడలి వరకు మిర్తిబట్టి కాలువల్లో పూడికలు తీసి నిధులు వృథా అవుతున్నాయి తప్ప, శాశ్వత పరిష్కారానికి ఆలోచన చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పన్నులు చెల్లిస్తున్నా అందుకు తగ్గట్లు అభివృద్ధి మాత్రం నగరంలో ఉండడం లేదని ప్రజలు వాపోతున్నారు.

చినుకు పడితే చెరువు



మా కాలనీలో చిన్న వర్షం పడినా చెరువులా తయారవుతుంది. రోడ్లు సక్రమంగా వేసి కాలువ లైన్లు నగర శివారు ప్రాంతాలకు కలిపితే ఇటువంటి సమస్య ఉండదు. వర్షంపడే రోజుల్లో హాస్పిటల్స్, స్కూల్స్‌కి వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తోంది.

– డబ్బీరు మోహనరావు, హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీకాకుళం నగరం

ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాం



చినుకుపడితే చెరువులా నగరమంతా తయారవుతుంది. కాలువల్లో పూడికలు తీసినా రోడ్లు మురుగునీరు, వర్షపు నీటితో నిండిపోతున్నాయి. వర్షం పడిన సమయంలో బయటకు రావాలంటే భయమేస్తోంది. ద్విచక్ర వాహనాలతో ఎక్కడ నీటిలో ఉండిపోతామోనని ఆందోళన కలుగుతోంది. వాహనాలు సైతం రిపేర్లకు గురవుతున్నాయి. వర్షం పడిన సమయంలో ఇలిసిపురం, ఫారెస్ట్ కార్యాలయం, కృష్ణాపార్కు, పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డులో నరకం చూస్తున్నాం.

– కంఠ చిరంజీవిరావు, ఏఎస్ఎన్‌కాలనీ, శ్రీకాకుళం నగరం


బలగ నుంచి బావాజీనగర్‌కి వెళ్లే దారిలో...


చెరువుని తలపిస్తున్న రిమ్స్ హాస్పిటల్ రోడ్డు

సంక్షిప్తంగా..

ఏకదంతాయ నమః


బలగ కాలభైరవ పీఠం దేవాలయంలో గరిక పూజలు

శ్రీకాకుళం కల్చరల్ : శ్రీకాకుళం నగరంలో వినాయక చవితి నవరాత్రులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. లడ్డూ వేలంపాటల్లో ఆసక్తి ఉన్నవారు ఉత్సాహంగా పాల్గొన్నారు. పూజ మండపాల వద్ద చేపట్టిన దీపారాధనలు ఆకట్టుకున్నాయి. పలుచోట్ల నిమజ్జనానికి గణనాథులు తరలి వెళ్లారు.

అన్నదానం మిన్న

శ్రీకాకుళం అర్బన్: అన్ని దానాల్లోకి అన్నదానం మిన్న అని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని హయాతీనగరం రెల్లివీధిలో రెల్లి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూర శ్రీనివాసరావు సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో 44వ వార్డు ఇన్‌చార్జి కవ్వాడి సుశీల, రెల్లి యూత్ అసోసియేషన్ ప్రతినిధులు ఆకుల అప్పారావు, ఆకుల కృష్ణ, ఆకుల శివ, ఇట్రాల రమణ, ధనాల లక్ష్మీకాంత్, యూత్ ఆకుల దేవీ ప్రసాద్, నీలాపు జీవన్, ఆకుల నవనీత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారావుకు అభినందనలు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి గ్రామానికి చెందిన పట్నాన ధర్మారావు ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో పీజీటీ(తెలుగు) విభాగంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. దీంతో ఆయనను గ్రామస్తులు సోమవారం సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

మందిరానికి రూ.10 వేల విరాళం

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులో ఉన్న సత్యసాయి మందిరం (పెద్దమందిరం)కు మేస్త్రి మెట్ట నాగభుషణం రూ.10 వేలు విరాళం మందిరం కన్వీనర్ మురళీకృష్ణకు సోమవారం అందించారు. ఇటీవల మందిరంలో గణపతి ఉత్సవాలు, సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా వంద గంటల భజనలు నిర్వహిస్తున్న నేపథ్యంలో విరాళం అందించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

జి.సిగడాం: గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్క అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ మహాదేవు సరిత, ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు సూచించారు. మండల కేంద్రంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం సోమవారం నిర్వహించారు. గ్రామాల్లో నెలకున్న సమస్యలను పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో అంటురోగాలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో ముళ్ల శ్రీనివాసరావు, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పర్యావరణాన్ని కాపాడాలంటే ప్లాస్టిక్‌ని నిషేధించాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రైవేట్ స్కూల్ యజమానులతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్‌లో పిల్లలకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలని కోరారు. అన్ని స్కూల్స్ కూడా ప్లాస్టిక్ రహిత స్కూల్స్‌గా ప్రకటించేలా చూడాలన్నారు.